ఆదాయంతో నీ కోర్కెలు ఎన్నింటిని చంపుకున్నావో నీవు పెదవి విప్పి చెప్పకపోయినా నాకు తెలుసు. నా సంతోషం కోసం. నాతృప్తి కోసం నీ అయిష్టాల నెన్నింటినో ఇష్టంగానూ, మరెన్నో ఇష్టాలను అయిష్టంగానూ మార్చుకున్నావు.

ఎప్పటి కప్పుడు ఈ ఆలోచనలను, బాధలను నీ చల్లని చిరు నవ్వుతోనూ, నీ ఆప్యాయతతోనూ మరచిపోవటం నాకు అంతకష్టం అనిపించలేదు. పిల్లలు పుట్టాక మన ఇద్దరి ఆలోచనా వారిపైవే వుండటం ప్రారంభం అయింది.

తల్లిదండ్రులిద్దరికీ పిల్లలమీద ప్రేమ ఒకస్థాయిలో వుండటం నిజమే అయినా పిల్లలకు మాత్రం తల్లంటే ప్రత్యేక స్థానం, ఎక్కువ చనువు వుంటటం కూడా అంత నిజం.

"మీరు పిల్లల పట్ల మరీ కఠినంగా వుంటున్నారు" అని నీవు ఎన్నోసార్లు అనేదానివి. నీవు అలా అన్న ప్రతిసారి ముక్తసరిగా, ముభావంగా వుండేవాడిన్నేను.

ముఖ్యంగా ఈ వుత్తరంలో నేను వ్రాయ దలుచుకున్న విష యం మన అమ్మాయి కమల గురించి, ఇక ఆ విషయం ప్రారంభిస్తాను.

నీకు గుర్తుండే వుంటుంది. కమల పసి వయసులో నన్ను రక రకాల కోరికలు కోరుతుండేది. నిన్ను అది ఏమడిగినా 'నాన్నగారిని అడుగు' అంటూ నా దగ్గరకు పంపి ముసిముసిగా నవ్వుకునే దానివి.

అది నను ఏది అడిగినా "అలాగే కొందాం" అని ఓ తియ్యని అబద్ధం చెప్పి మరిపించేవాడిని. తెలిసీ తెలియని వయసులో పిల్లలు

మనసు చంపుకుని రెండు మూడుసార్లు అమ్మాయి మనసు మార్చటానికి ప్రయత్నించాను. వేరే గ్రూపు చదవమని ప్రోత్సహించాను. కానీ ఆ చిన్నారి మనసులోని బలీయమైన కోరిక నామాటల్ని ఖాతరు చేయనీయలేదు. మొదటి సారిగా నాతో పౌరుషంగానూ, పరుషంగా కూడా మాట్లాడింది.

ఇక దాన్ని ఒప్పించటం కష్టమైన పని అనుకున్నాను. అందుకే కాలేజి ప్రిన్సిపాల్ దగ్గరకు వెళ్ళి నా గోడు వెళ్ళబోసుకున్నాను. నా బాధను అర్థం చేసుకోమన్నాను. కష్టసుఖాలు తెలిసిన మనిషికాబోలు నన్ను తిట్టకుండా మౌనంగా తలాడించాడు నా అభీష్టానికి అంగీకార సూచనగా.

ఫలితంగా అమ్మాయికి సైన్సు గ్రూపులో సీట్లు అయిపోయిన వని, ఇంకా ఆలస్యం అయితే మిగతా గ్రూపుల్లో కూడా సీట్లుండవని చెప్పటం జరిగింది. ఆయనలా చెప్పడనే కంటే నేను చెప్పించా నంటే నిజం నిర్భయంగా నీ ముందు చెప్పినట్లు వుంటుంది. కాలేజి చదువుకే ముప్పు వాటిల్లుతుందనే భయం వలన కాబోలు అయిష్టం గానే ఆ గ్రూపులో చేరటానికి అంగీకరించింది కమల.

కొత్తగా కాలేజి చదువు ప్రారంభించానన్న ఆనందం ఆ పిల్ల మొఖంలో వెతికినా కనిపించలేదు నాకు. యాంత్రికంగా అలా కాలేజికి వెళ్లి, వచ్చేదాన్ని చూసినప్పుడల్లా నా మనసు విలవిల్లాడి పోయేది. నా జీవితంమీద నాకే అసహ్యం వేసేది.

చదువు మీదున్న శ్రద్ధతో, సహజంగా వున్న తెలివితేటల్తో అది చదువులో బాగానే రాణించింది. అంత తెలివైన పిల్లను, తను

కోరిన చదువు చెప్పించలేకపోయిన నిర్భాగ్యపు తండ్రిని నేను. విచక్షణారహితంగా దాని కోరికను మొదలంటా నరికివేశాను.

పెద్దగీత ముందు చిన్నగీత అన్నట్లు అప్పట్లో ఆ విషయానికి ఎంతో సిగ్గుపడిన నేను, ఇప్పుడు ఆలోచిస్తే అది చాలా మామూలు విషయంగా అనిపిస్తుంది.

మొన్న కాకినాడ సంబంధం వారు, హైద్రాబాదు వారు వచ్చి పెండ్లిచూపులు చూసి వెళ్లారు కదా సుగుణా. ఆ ఇద్దరికి అమ్మాయి నచ్చిందట. ఈ విషయం తెలియగానే ఆశ్చర్యపోతున్నావు కదూ! నిజమే. మన అమ్మాయి వారిరువురికి నచ్చింది.

అమ్మాయి కాకినాడ సంబంధం అంటే ఎక్కువ ఇష్టపడుతున్నట్లు చెప్పేవు. అందం, ఆస్తి విషయంలోనూ, ఉద్యోగం, హెూదా విషయంలోనూ అతన్ని కోరుకుంది కమల. ఈ విషయం ఆమె మనకు సూటిగా చెప్పకపోయినా, నీ తల్లి మనసు గ్రహించి ఈ నిర్భాగ్యపు తండ్రికి వివరించింది. ఇద్దరి అభిప్రాయాలు సేకరించాను.

కాకినాడ వారు అడిగిన కట్నం, కోరిన లాంఛనాలు నాస్తోమతకు మించిపోయినై. నేను వారితో సరితూగలేనేమో ననిపించింది. మరికొంత అప్పు చేసయినా సరే పిల్లని వారికే ఇచ్చేద్దామంటే పెళ్ళి అయ్యాక కూడా వారికోరికలు వగైరాలు నాకు భయంకలిగించినై.

నా స్తోమతకు, నా శక్తికి తగినట్లుగా అనిపించిన హైదరాబాద్ సంబంధం ఖాయం చేసుకుని వచ్చాను.

'కాకినాడ వారికి నీవు నచ్చలేదుటమ్మా' అని చెప్పకూడని అబద్ధం చెప్పేను. పిచ్చితల్లి ఈ మాటకు ఎంత బాధపడిందో. నా

బంగారుతల్లి నచ్చకపోవటమా. ఆ మాట నా నోటితో నేను ఆ చిట్టి తల్లితో అనడమా... కానీ అనేశాను సుగుణా. ఆమె సున్నిత మయిన మనసు ఎంత గాయపడుతుందో ఆలోచించకుండా అనేశాను.

అంతే కాదు. అల్లుడ్ని గురించిన వివరాలు కనుక్కున్న మాట నిజమే అయినా, అతను అన్నిరకాలుగా యోగ్యుడని తెలుసుకున్న మాట కూడా నిజమే అయినా మరిన్ని జోడించి అతన్ని గురించి గొప్పగా చెప్పి అమ్మాయిని ఉత్సాహపరిచాను.

నా మాటలకు ఉప్పొంగిపోలేదు. కృంగిపోలేదు. బహుశా 'ఈ నాన్న యింతే, నేనడిగినవి ఎప్పుడు సమకూర్చాడు కనుక' అను కున్నదేమో పిచ్చితల్లి మౌనంగా తలాడించి తన అంగీకారం తెలి పింది. పసివయసు నుంచి పెళ్ళి వరకు తను కోరింది ఏ ఒక్కటీ సమకూర్చలేక పోయాను. మిగిలిన విషయా లన్నింటికి ఎలాగో రాజీపడి నా మనసును నేనే సమాధాన పరుచుకున్నా కనీసం పెళ్ళి విషయంలోనైనా అమ్మాయి కోరిక తీర్చగలిగి ఉంటే ఇంత మాన సిక క్షోభ వుండేది కాదేమో నాకు. కాని వారి ఆలోచనా విధానం అంతా ఆర్థిక పరమైన లావాదేవీలతో ముడిపడి వుండటం గ్రహిం చిన నేను ధైర్యం చేయలేక పోయాను.

నిజానికి ఈ విషయా లేవీ అమ్మాయికి తెలియవు. దాన్ని అడుగడుగునా మోసం చేశానన్న బాధ నన్ను కృంగదీస్తున్నది.

నా బాధని, ఇబ్బందిని నీవు అర్థం చేసుకుని క్షమిస్తావని ఆశిస్తున్నాను.

ఉత్తరం వ్రాయటం పూర్తి చేసి డాబా పైనుంచి కిందికి వచ్చాడు రంగారావుగారు.

పేరంటం నుంచి తిరిగివచ్చి అప్పటికే ఆలస్యం అయిపోయి నట్లు హడావిడిగా వంటపనిలో నిమగ్నమయింది భార్య.

"సుగుణా నేనలా బయటికి వెళ్ళివస్తాను .. ఇదిగో ఇవి చూడు" అనునయంగా అన్నాడాయన.

భర్త చేతిలో కాయితాల వంక అర్థం కానట్లు చూస్తూనే యాంత్రికంగా అందుకుం దావిడ.

"ఏమిటండీ యివి" ఆశ్చర్యంగా అడిగింది.

ఆయనలా వీధిలోకి నడిచాడు మౌనంగా.

ఉత్తరం చదవటం పూర్తిచేసిన సుగుణమ్మగారి కళ్ళలో నీటి సుడులు. కూతురిమీద ప్రేమ, భర్తమీద సానుభూతి, తనపై తనకే జాలి.

మనసులో భావాలెలా వున్నా వెంటనే తేరుకున్నదామె. భర్త వచ్చేసరికి చిరునవ్వు చెదరకుండా ఎదురు వెళ్ళింది.

"అన్నీ అనవసరమైన ఆలోచన్లు ...మీరూ. ఇప్పుడు దాని కేం తక్కువయింది. చక్కగా సంసారం చేసుకుంటూన్నది. రేపో మాపో పండంటి బిడ్డను కంటుంది. అప్పట్నుంచి దానికీ తెలిసి వస్తయ్ కష్టసుఖాలు.

మన శక్తికొద్దీ చదివించాం. తాహతుకు తగిన సంబంధం కుదిర్చి తాళి కట్టించాం. చాలు మీరు దాని కేరకంగానూ అన్యా

యం చేయలేదు, అనవసరంగా మనసు కష్టపెట్టుకోకండి." చనువుగా మందలింపుగా అన్నది సుగుణమ్మ.

పొంగివచ్చే దుఃఖాన్ని దిగమింగుకుని గట్టిగా భార్యను కౌగలించుకున్నాడు రంగారావు.

"ఇదిగో ఇలాంటి మాటల్తోనే నన్ను అప్పట్నించి ఇప్పటి వరకూ ఊరడిస్తూ వస్తున్నావు సుగుణా" మనసులో అనుకున్నాడాయన.

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక—ది. 9-2-90)

●● "జీవిత లతాగ్రాన పూసే ఎర్రని పువ్వు బాల్యం. అటువంటి బాల్యాన్ని కోల్పోయిన కోట్లాది బాలలున్న దేశం మనది. బాల్యం శ్రమించవలసిన పరిస్థితే విషాదకరమైతే, దొంగచాటుగా శ్రమించవలసిన పరిస్థితిని ఇంకే మనాలి! ●●

## శ్రమ

ఉదయం ప్రారంభించిన ప్రహరీగోడ కట్టుబడి సగం పైనే పూర్తవుతుందనుకున్నాను కానీ మరో రెండు రోజులు పని సాగితే కానీ గోడ పూర్తిగా తయారయ్యేటట్లు కన్పించలేదు

ఇల్లు కట్టించాలని ఎంతో కాలంనుంచి పెంచుకున్న కోరిక పెంకుటిల్లు రూపంలో తీరి తృప్తి కలిగించినా, ఆ ఇంటికి చుట్టూ ప్రహరీగోడ కట్టించలేపోయాను ఇన్నాళ్ళుగా.

ఇంటికి ప్రహరీ ఎంతటి అందాన్నీ, హుందానీ కలిగిస్తుందో తెలిసినా డబ్బు కొరత కారణంగా ఇల్లు పూర్తయి చాలాకాలం ఐనా ప్రహరీ మాత్రం కట్టించ వీలు కాలేదు.

ఇంటికి ముందూ, వెనక కూడా వున్న కొద్దిపాటి ఖాళీస్థలంలో పూలమొక్కలూ, కూరమొక్కలూ పెంచటంతో వాటి రక్షణకోసమైనా ప్రహరీ గోడ అవసరం మరింత పెరిగింది. అయితే మాత్రం ఏం లాభం? అందుబాటులో లేని ఆర్థిక వనరుల కారణంగా అంచ

నాలకు మించి ఖర్చు అయ్యే ఈపనిని ప్రారంభించే అవకాశం ఇప్పటికి గాని కుదర్లేదు. త్వరత్వరగా పని పూర్తయితే మా ఇంటి సరికొత్తఅందాన్ని తనివితీరా చూసుకోవాలని ఉబలాటంతో వున్నా న్నేను. గోడ అంచు వారగా నేలమీద పరచిన పట్టాలమీద పడిన సిమెంటును ఒక బొచ్చె లోకి ఎత్తుతున్నాడు పని కుర్రవాళ్ళలో ఒక డైన రెడ్డి. అలా ఎత్తిన సిమెంటును గోడకు అక్కడక్కడ మెత్తు తున్నాడొక మేస్త్రి. మిగిలిన ఇద్దరు మేస్త్రీలు పని పూర్తిచేసి బావి దగ్గర కాళ్లు చేతులు కడుక్కుంటున్నారు. పని కుర్రవాళ్ళలో ఓ ఇద్దరు బొచ్చెలూ, పారలూ, తాపీలూ నీళ్ళలోకడిగి శుభ్రంచేస్తుంటే మరొకడు లెవెలింగ్ బద్దలకు అంటుకున్న సిమెంటును గీకి శుభ్రం చేస్తున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో ఇంటి ముందుకు వచ్చి ఆగింది ఇసుక లారీ. లారీ కంటపడగానే కంగారు, కలవరం ప్రారంభమైనై నాలో.

తెల్లవారితే ఒకటవ తారీకు కావటాన పనివాళ్లు పన్లోకి రారు. ప్రతి నెల ఒకటవ తారీకు వాళ్ళకి ఆటవిడుపుట. రెండవ తారీకున మరెక్కడో శంకుస్థాపన కార్యక్రమం వున్నదట.అక్కడ మార్కింగ్ చేయటం వగైరా పనుల కోసం వాళ్ళు ముఠా అంతా అక్కడికే వెళ్ళాలట. గత రెండు మూడు రోజుల్నుంచి మబ్బుపట్టి వర్షంవస్తుం దేమో ననిపించేటట్లు వుంటున్నది వాతావరణం. ముసురుపట్టకుండా వుంటే మూడో తారీకు పని పునఃప్రారంభం. లేకపోతే వాన వెలిసిన తర్వాతనే.

ఇలాంటి పరిస్థితుల్లో ఇసుకను అలా రోడ్డుమీదనే వుంచే యడం ఇష్టం లేకపోయింది నాకు. ఇసుక దొరకడం కష్టంగావుందని

విని ముందు జాగ్రత్తగా చెప్పి వుంచానే గాని అంత త్వరగా వచ్చేస్తుందని వూహించలేదు నేను.

ఇసుకలా రోడ్డుమీదనే వుంచేస్తే ఇంట్లో పిల్లలు వీధిలోపిల్లలు ఇక ఆ కుప్పమీదనే వుంటారు. పిల్లలే కాదు, కుక్కలు వగైరాలు కూడా ఆ ఇసుక కుప్పమీదనే పడి దొర్లుతుంటాయి. కాళ్ళతో చెల్లా చెదరు చేస్తాయి. వీటన్నింటికి మించి ఏ తుఫానో వస్తే వానకు కొంత, గాలికి కొంత మురుక్కాలవల్లోగుండా ప్రయాణించి రోడ్ల పాలవుతుందనే భయంతో ఆరు వందలు పెట్టి కొన్న ఇసుక నలా వృధా పరచటం అవివేక మనిపించి ఎలాగయినా ఇసుకను యింట్లో పోయించేందుకు నిశ్చయించుకున్నాను.

నా ఆలోచన పూర్తికాకముందే ఇసుకను రోడ్డుమీద జార్చి డబ్బులందుకుని లారీ వెనక్కు మళ్ళించుకొని వెళ్ళిపోయారు వాళ్ళు.

కాళ్ళు, చేతులు తుడుచుకుని, కండువాలు విదిలించి భుజాన వేసుకున్న మేస్త్రీలు సైకిళ్లు చేత పుచ్చుకుని తిరుగుముఖం పట్టారు. కొంత సామాను మా ఇంట్లోనే వుంచి. మరికొంత సామాను తలా ఒకటి చేత పట్టుకుని కదిలారు పని కుర్రవాళ్లు. దారికి అడ్డంగా పడి వున్న ఇటుక రాళ్ళను ఏరి గోడపక్కగా పేర్చి, నీళ్ళ బిందెనూ, బక్కెట్‌నూ కడిగి వరండాలో పెట్టాడు రెడ్డి. బావి దగ్గరకు వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కునేందుకు నీళ్ళు తోడుకుంటున్న రెడ్డి దగ్గరకు వెళ్లి.

"రెడ్డీ, ఇసుకంతా ఇంట్లోకి చేరిస్తే బాగుంటుందిరా" అన్నాను.

"లోపల పొయ్యమంటారా అయ్యగారూ" ఉత్సాహంగా అడిగాడు వాడు.

"పోస్తేనే మంచిదిరా....ఇప్పుడే మొదలుపెట్టేస్తావా" అడిగాన్నేను.

"ఎంత సేపండి బాబూ. పదయ్యేతలకి మొత్తమంతా అయిపోద్దండీ"

"అయితే పోసెయ్యరా" అన్నాను.

ఇసుకనలా రోడ్డుమీదనే వుంచేస్తే అనవసరంగా ఆగమయిపోతుందనే కాకుండా, అటుగా వెళ్తున్న ఏ మునిసిపల్ ఉద్యోగికైనా కుప్ప కన్పిస్తే రూల్సు మాట్లాడి ముడుపు చెల్లించమంటాడు. వాళ్ళతో వాదనలోకి దిగేకంటే బేరాలాడి చేతులు తడపటమే నయమని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. ఇంట్లో పోయించేస్తే కొంతవరకూ వాళ్ళ దృష్టి పడకుండా తప్పించుకోవచ్చని భ్రమపడటం కూడా మరో కారణం.

"ఓ టీ తాగిరమ్మందాం వాడ్ని" అనుకుంటూ వెనుదిరిగిన నాకు అప్పటికే పార, బొచ్చ పుచ్చుకుని ఇసుక కుప్ప దగ్గర కన్పించాడు రెడ్డి.

ఓవర్ టైమంటూ అదనపు సంపాదనకు అవకాశం వున్న ఆఫీసులు కొన్ని వున్నయ్. ఆఫీసు వేళల్లో తీరిగ్గా కూర్చునో. అటు తర్వాత ఓవర్ టైమంటూ కూర్చుని సంపాదించిన వాళ్ళు, సంపాదిస్తున్నవాళ్ళు నాకు తెలుసు. కానీ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒళ్ళు దాచుకోకుండా కష్టపడి పనిచేసి, ఇంటిముఖం పట్టే

సమయానికి మళ్ళీ పని అప్పగిస్తే సంతోషపడి మరీ ఒప్పుకున్న రెడ్డి అంటే నాకెందుకో జాలి వేసింది. ఈ అదనపు పనికి నేను డబ్బు ఇచ్చినా కేవలం డబ్బుకోసం బడలిక మర్చిపోయి, బద్ధకించకుండా, ఒళ్ళు వంచాల్సిన అవసరం వాడి కేమిటోనన్న సందేహం కలిగింది నాకు. పైగా వాడు చేసేందుకు సిద్ధపడిన పని చిన్నదేం కాదు. లారీ ఇసుకను వీధిలోనుంచి ఇంట్లోకి చేర్చాలి. ఒక్కొక్క బొచ్చ నింపుకుని, తలకెత్తుకుని లోపల పోయడమంటే....

అసలు ఆఫీసులో అయిదు గంటలవరకు వుండటం, వున్నంతసేపూ పనిచేయటం, మా విధే అయినా నాలుగు గంటల నుంచే ఇంటికి వెళ్ళే ప్రయత్నంలో పని ధ్యాస లేకుండా తిరిగేందుకు అలవాటు పడ్డాక రెడ్డిలాంటి వాళ్ళను చూసి ఆశ్చర్య పడటంలో ఆశ్చర్యము లేదేమో! ఓ అరగంట గడిచాక

"ఇదిగో రెడ్డీ ఈ డబ్బు తీసుకెళ్ళి ఏదయినా టిఫెన్ చేసి రారా, వచ్చాక మళ్ళీ మొదలుపెడుదూగాని" అన్నాను.

దగ్గరగా వచ్చి నేనిచ్చిన నోటు అందుకుని చొక్కాజేబులో తురిమి మళ్ళీ చొక్కానలా గడ్డిమీద పడేశాడు.

"ఇప్పుడేమన్నా తింటే పొట్ట వంగదండయ్యగారూ ఆయాసం వచ్చేత్తది. పని సాగదు. కానీండి సగం అయ్యాక ఎల్లొత్తాలే" అంటూనే బొచ్చ నెత్తుకున్నాడు.

ఇసుక లోపలికి జేర్చినందుకు రెడ్డి ఇవ్వమన్నది పాతిక రూపాయలు. రోజు పనికి మేస్త్రీ వాడికి యిచ్చేది పాతిక రూపాయలే. అంటే ఆరోజు వాడి సంపాదన రెట్టింపన్నమాట. పెళ్ళి కాలేదు. చేసుకో

వాల్సిన వయసు కూడా కాదు రెడ్డికి. సంసారభారం పడక ముందే డబ్బు సంపాయించాలనే వాడి ఆరాటం, అందుకు రాత్రిపూట కూడా కష్టపడి అదనంగా సంపాయించేందుకు సంసిద్ధం కావటం నాకు అర్థం అయ్యీ అవకుండా వుంది.

రెడ్డిని చూస్తే నాకు జాలిగా వుంటుంది. బహుశా వాడి బాహ్య రూపమే అందుక్కారణమేమో! మనిషి దుక్కలా వుంటాడు. పళ్ళు ఎత్తుగా వుండి, నవ్వినప్పుడు మామూలుగా కంటే మరింత వికారం గా కనిపిస్తాడు. వాడి నవ్వు వెకిలిగా వున్నట్లుంటుంది. మాటకూడా స్పష్టంగా పలకలేడు. కాలు కొద్దిగా అవుడు కాబోలు పాపం కాస్త ఈడుస్తూ అడుగేస్తుంటాడు. అయినా పనిమాత్రం వాళ్ళ జట్టులో మిగిలిన కూలీల కంటె హెందిగ్గా, ఓర్పుగా చేస్తాడు. బద్ధకించడు. ఒళ్ళు దాచుకునే పనిదొంగ కాదు రెడ్డి. అయినాసరే అందరూవాడ్ని ఎగతాళి చేస్తుంటారు. కసురుకుంటూ విసురుగా విసుగ్గామాట్లాడతారు

రెడ్డిని గురించి ఆలోచిస్తూ మనసులోనే వాడిపట్ల సానుభూతి కురిపిస్తూ చెట్ల పాదుల్లో పడిన ఇటుకముక్కల్ని, సిమెంటు ముద్దల్ని ఏరి పక్కకు పెడుతూ చీకటి పడేవరకు కాలక్షేపం చేసి స్నానానికి బయలుదేరాన్నేను.

అప్పటికి సగంకూడా పూర్తికాలేదు. ఇసుక పూర్తిగా అయి పోయేసరికి పదకొండు గంటలు అవుతుందనిపించింది. నిర్విరామం గా ఒక్కొక్క బొచ్చ లోపల పోస్తున్నాడు రెడ్డి.

స్నానం పూర్తిచేసి బయటకు వచ్చిన నాకు రెడ్డి కనిపించ లేదు. బహుశా టీకి వెళ్లివుంటా డనుకున్నాను. కాఫీ తాగుతూ టి.వి.

లో వార్తలు విని బద్ధకంగా వాలు కుర్చీలో నడుం వాల్చిన నాకు మాగన్నుగా నిద్ర పట్టింది.

"నాన్నా అన్నం తిందాం. లేవండి" అంటూ మా కాళీచరణ్ లేపేవరకు నిద్రపోతూనే వున్నాను. అప్పుడు టైం తొమ్మిదయింది. కిటికీ గుండా తొంగిచూసిన నాకు బొచ్చుమోస్తూ లోపలికి వస్తున్న రెడ్డి కనిపించాడు. బయటకు వెళ్ళి ఇసుక కుప్పను చూశాను. సగం పైనే లోపలికి చేర్చాడు. బహుశా మరో రెండు గంటల్లోపునే పూర్త వచ్చునిపించింది.

భోజనం పూర్తిచేసి టీ.వీ. ప్రోగ్రామ్స్ కాసేపు చూసి అప్రయత్నంగా నిద్రలోకి జారుకున్న నేను "అయ్యగారూ... అయ్యగారూ" అన్న రెడ్డి పిలుపుతో మేలుకున్నాను.

"అయిపోయిందయ్యా ఇంక ఎల్తాను"అంటూ నవ్వేడు రెడ్డి.

వెంటనే లోపలకు వెళ్ళి పాతిక రూపాయలు తెచ్చి వాడికందించాను.

సంతోషంగా అందుకుని "అయ్యగారూ" అంటూ ఆగిపోయాడు వాడు.

"ఏంట్రా....డబ్బులు చాల్లేదా"

"అదికాదయ్యా....నేనిప్పటిదాకా పనిచేశానని మేస్త్రీకి చెప్పద్దయ్యా....ఇసుక నే పోశానని చెప్పొద్దయ్యగారూ"

వాడి అభ్యర్థన అర్థం కాలేదు నాకు.

"ఏరా దీంట్లో కూడా తన కేమైనా వాటా అడుగుతాడా మీ మేస్త్రీ" అడిగాను అనుమానంగా.

అబ్బే కాదండీ. మేస్త్రీ అలాంటోడు కాదు గానీ మా ఇంట్లో వాళ్ళకు చెప్తాడయ్యా" అన్నాడు నవ్వుతూ.

"చెప్తే ఏం రా....నువ్ మాత్రం చెప్పవా?"

"చెప్పనయ్యా"

"మరిప్పటిదాకా ఎక్కడికి వెళ్లావంటే ఏం చెప్తావు?"

"సినిమా కెళ్లానని చెప్పుకుంటానయ్యా"

వాడి సమాధానంతో అమితాశ్చర్యం వేసింది నాకు. సామాన్యంగా పిల్లలు బడి ఎగ్గొట్టి, ట్యూషను ఎగ్గొట్టి సినిమాలకు వెళుతుంటారు. ఎక్స్ట్రా క్లాసుల వంకతో సినిమాలకు వెళుతుంటారు. అలాంటిది అప్పటివరకు రెక్కలు ముక్కలయ్యేటట్లు పనిచేసి ఇంట్లోవాళ్లకు సినిమాకు వెళ్లానని చెప్పటం ఏమిటో,ఎందుకో అంతుపట్టలేదునాకు.

"ఎందుకురా అలా చెప్పటం....అలా చెప్తే వూరుకుంటారా మరి" అడిగాను నా ఆశ్చర్యాన్ని అణచుకుంటూ.

"ఏం చెయ్యమంటారు సార్. నాకు వచ్చే కూలి డబ్బులు నా చేతి కివ్వడు మేస్త్రీ. నేరుగా లెక్క చెప్పి మా అయ్యచేతి కిస్తాడు. అలా ఇవ్వమని మా అయ్యే అడిగాడు. ఇంట్లో డబ్బడిగితే కోప్పడతారు. ఇప్పుడయినా సినిమాకి ఎల్లానని సెప్తే కొడతారు డబ్బులెక్కడివని. గానీ నాలుగు దెబ్బలు తిన్నా పాతిక రూపాయలు మిగులుతై కదయ్యా. అందుకని సెప్పద్దంటన్నాను." అని చెప్పి సిగ్గుతో తల వాల్చుకున్నాడు నవ్వుకుంటూనే రెడ్డి.

వాడి పరిస్థితికి జాలిపడాలో, ఏంచెయ్యాలో అర్థంకాని నాకు మాత్రం మనసు మొద్దుబారింది. ఆ రాత్రి నిద్ర కరువయింది.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక—27-12-91)

# ఆమె మనసు

"నేను నచ్చిన మీకు,

పెళ్ళిచూపుల కార్యక్రమం పూర్తికాగానే 'ఇంటికి వెళ్లి వుత్తరం రాస్తాం' అన్న మీ మాటలు విని ఇప్పటివరకూ చూసివెళ్ళిన అందరిలాగానే మీరూ మౌనం వహించి ఊరుకుంటా రనుకున్న మా వాళ్ళందరికీ నేను మీకు నచ్చానని. ముహూర్తాలు పెట్టించే ఏర్పాట్లు చేయమని మీరు రాసిన ఉత్తరం ఎంతో సంతోషం కలిగించింది.

"సంతోషం కలిగించింది నాకు తప్ప మా కుటుంబ సభ్యులందరికీ అనే విషయం మీరు గమనించాలని మరోసారి ప్రత్యేకంగా ఈమాట రాస్తున్నాను. ఆశ్చర్య పడుతున్నారు కదూ! నేను నిజమే రాస్తున్నాను. నాకు సంతోషం కలగక పోవటానికి కారణం మీకు తెలియజేయటం సంస్కార మనిపించుకుంటుంది. కానీ కారణం నాకే తెలియదు.

"ఎందరికో నచ్చని మీకు నచ్చినందుకు మాత్రం ఆనందంగానే ఉంది. ఎందువల్లనో చెప్పలేను కానీ నాకుమాత్రం మీరు నచ్చలేదు. అయినా ఈ విషయం మీ ఒక్కరితో తప్ప మరెవ్వరికీ చెప్పలేదు. చెప్పలేను, చెప్పను కూడా. ఈ ఉత్తరం చదివాక కూడా మీ

నిర్ణయం మార్చుకోకపోతే మిమ్మల్ని వివాహం చేసుకోవటానికినాకు అభ్యంతరం మాత్రం లేదు. మన పెళ్ళి తప్పక జరుగుతుంది.

"జరుగుతున్న పెళ్ళిళ్ళన్నీ వధూవరు లిద్దరికీ పూర్తి ఇష్ట పూర్వకంగా జరుగుతున్నవే అని నేను అనుకోను. విచిత్రమైన పరిస్థితుల్లో, వివిధ కారణాలవల్ల, వత్తిడివల్ల జరుగుతున్న వివాహాలు ఎన్నో.

"ఇక మీకు నచ్చిన నా గురించి మీకు కొన్ని విషయాలు చెప్పదలుచుకున్నాను. సహృదయంతో అర్థం చేసుకుంటే అదృష్ట వంతురాల్ని. ఇలా మీరు నాకు నచ్చలేదని చెప్పటం నా అహంకారం కాని, అతిశయం కానీ కానేకాదు.

"నేను కాలేజీలో చదివే రోజుల్లో మా ఇంట్లో ఎప్పుడైనా నా పెళ్లి ప్రస్తావన వస్తే 'మాబంగారానికి అయ్యేయస్ ఆఫీసర్ని తీసుకు వస్తాను. అయినా మా బంగారుకొండను చేసుకోవటానికి పెళ్ళికొడుకులు క్యూలో నిల్చుంటారు' అంటుండేవాడు మా అన్నయ్య. వాడి మాటలు విని నాలో నేనే మురిసిపోయేదాన్ని. వాడికి నా మీదున్న ప్రేమకు మా అమ్మా నాన్న కూడా ఎంతో సంతోషపడేవారు. తరచుగా వాడిలా మాట్లాడటం నాలోనేనే సంబరపడిపోవడం కాబోయే వాణ్ని గురించి కలలు కంటూ ఉండటం జరిగేవి,

నా చదువు పూర్తయింది. పెళ్లిచూపుల ప్రహసనం ప్రారంభ మయింది. మొట్టమొదటి పెళ్ళిచూపుల కార్యక్రమం చాలా ఆడంబరంగా జరిపించాడు మా అన్నయ్య. ఓ ఆయ్యేయస్ ఆఫీసరు తల్లి దండ్రులతో కూడా వచ్చాడు నన్ను చూసేందుకు. నేను అతనికి నచ్చలేదు.

అతగాణ్ణి మా అన్నయ్య తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టేడు. అంత కంటే గొప్ప సంబంధం తెస్తానన్నాడు. అతన్లో తప్పులన్నీ ఎత్తి చూపేడు. అతని అందాన్ని అవహేళన చేశాడు. వాడి మాటలకు ఇంట్లో అందరం నవ్వుకున్నాం. ఓ వారం రోజులపాటు ఆ కార్య క్రమం మాకు మంచి కాలక్షేపాన్ని కలిగించింది.

"ఓ పదిమంది వరకు అయ్యేయస్ ఆఫీసర్లు నన్ను చూసి వెళ్ళారు. వాళ్ళెవరికీ నేను నచ్చలేదు. ఓ రెండు సంవత్సరాలుఅలా గడిచిపోయాయి. నాతోపాటు మా అన్నయ్య మనసులోకూడా నిరాశ చోటుచేసుకున్నది. ఇంట్లో వాళ్ళంతా ఓ మెట్టు కిందకు దిగారు. డాక్టర్లు, ఇంజనీర్లు లేక ఉన్నతాధికారులు మా అన్నయ్య దృష్టిలో చోటు చేసుకున్నారు. వారికోసం అన్వేషణ ప్రారంభించాడు. ఆ స్థాయి వ్యక్తులుకూడా ఓ అరడజను మందికి పైగా నన్ను చూసి వెళ్ళారు. వాళ్ళెవరికీ కూడా నేను నచ్చలేదు.

నా పెళ్ళి మా ఇంట్లో వాళ్ళకు సమస్యగా మారింది. అమ్మ నాన్నలకు ఇదో మానసిక వ్యథగా మిగిలింది. నా పెళ్ళి చూపుల కార్యక్రమం అనగానే మా అన్నయ్యకు విసుగు కలిగే విధంగా మారింది. తప్పనిసరన్నట్లు ఆ తంతు కాస్తా ముగిసిందనిపించేవాడు.

అలా మరో రెండున్నర సంవత్సరాలు కాలగర్భంలో కలిసి పోయినై. అమ్మ నాన్నల్తోపాటు నా బలవంతం కూడా ఉండటం వల్ల అన్నయ్య పెళ్ళి చేసుకున్నాడు. అన్నయ్య పెళ్ళి సంబరం, కొత్తగా వచ్చిన వదినతో కబుర్లతో కొన్నిరోజులు హాయిగా గడిచి పోయినై.

అటు తర్వాత గవర్నమెంటు ఉద్యోగస్తుడయితే చాలనుకొని సంబంధాలు వెతకటం ప్రారంభించారు. ఆస్తి, అందం ఓ పక్కకు నెట్టి నాలుగంకెల జీతం సంపాయిస్తున్న వాడైతే చాలంటూ సర్దుబాటు చేసుకున్నారు. సంతృప్తి పడదాం అనుకున్నారు. అప్పటికే నేను కాబోయే వాణ్ణి గురించి కలలు కనటం మానేసి చాలా కాలం అయింది.

నీ పెళ్లి మా కళ్ళతో చూసుకునే అదృష్టం వున్నదో లేదో అంటూ అమ్మా నాన్నలు కళ్ళ నీళ్ళు పెట్టుకోవటం, అన్నయ్య అది వరకులా శ్రద్ధగా నా పెళ్లి ప్రయత్నాలు చేయటంలేదని మనస్తాపం చెందటం మొదలుపెట్టారు. కానీ నేను మాత్రం మా అన్నయ్యను గురించి ఎప్పుడూ అలా అనుకోలేదు.

పుట్టింటి వారితోనూ, ఇరుగు పొరుగు వారితోనూ నా పెళ్ళి గురించి వదిన వ్యంగ్యపు మాటలు ఎన్నోసార్లు నే వినకపోలేదు. మౌనంగా భరించాను.

మా బంధువుల ఇళ్ళలో ఎక్కడ ఏ శుభకార్యానికి పిలుపు వచ్చినా, అశుభాలకు వెళ్ళవలసి వచ్చినా మా అమ్మానాన్నా తప్పకుండా నన్ను వాళ్ళవెంట తీసుకువెళ్లేవాళ్ళు. నన్ను వదలి ఒక్క పూటకూడా వాళ్ళు వుండలేక కాదు. వాళ్ళను వదిలి నేను వుండలేననీ కాదు,

పదిమంది బంధువులు, కొత్తవారుకూడా ఒకచోట కలుస్తారు. పదిమంది చూపుల్లో పడ్డ నేను ఏ ఒక్కరికైనా నచ్చుతానేమో అన్న

ఆశతో మాత్రమే నన్ను తీసుకు వెళ్ళేవాళ్ళు. కానీ పాపం వాళ్ళ ఆశలు అడియాసలే అయినై.

కానీ ప్రస్తుతం నేను మా వాళ్లతో కలిసి ఎక్కడికీ వెళ్ళటం లేదు. అక్కడ చేరిన వాళ్ళంతా నా కింకా పెళ్లి కాలేదని తెలుసుకుని చేసే వ్యాఖ్యానాలకూ, చూసే చూపులకూ నేను తట్టుకోలేనని మావాళ్ళ అభిప్రాయం. నాలో వయసు తెచ్చిన మార్పులు నన్ను బయటకు వెళ్ల నీయకుండా కట్టేసినై కొంత వరకు.

మా ఇంటికి ఎవరైనా వస్తే క్లుప్తంగా మాట్లాడటం, మితంగా వారి కంట పడటం చేస్తూండటం అలవాటు చేసుకున్నాను. ఇవన్నీ మా వాళ్ళ కట్టుబాట్లు మాత్రం కాదు. నేను అలవరచుకున్న అలవాట్లు. నాకు నచ్చిన సర్దుబాట్లు.

అటు తర్వాత అన్నయ్యకూడా నా దురదృష్టాన్నీ. పరోక్షంగా నన్నూకూడా అసహ్యించుకున్నాడు ఒకటి రెండు సార్లు.అయినా నేను బాధ పడలేదు. ఎందుకో తెలుసా? నాకు పెళ్ళి చేయాలని వాడింకా ప్రయత్నాలు చేస్తున్నందుకు కృతజ్ఞతగానూ, ఇంకా దానికి పెళ్లేమిటి అంటూ నా గురించి పట్టించుకోకుండా ఉండనందుకు గౌరవంగా వుంటుంది వాడంటే నాకు.

ఇప్పటికి కనీసం యాభై సార్లయినా పెళ్లిచూపుల పేరిట పరాయి మగవారి ముందు తల వంచుకు కూర్చుని 'నేను మీకు నచ్చానా' అని మౌనంగా అడిగాను. అది విచిత్రమో, విడ్డూరమో కానీ ఏ ఒక్కరూ నన్ను మెచ్చుకోలేదు. ఎంచుకోలేదు. అలాంటి నేను మీకు నచ్చటంకూడా నా మటుకు నాకు విడ్డూరంగానే వుంది.

కుల గోత్రాలు సరిపోతే పెళ్ళాం పిల్లల్ని పోషించగల ఓ మగాడయితే చాలు. అతగాడు నన్ను చేసుకోవటానికి ఇష్టపడటం ఆలస్యం మూడురోజుల్లో ముహూర్తాలు పెట్టించి నన్ను సాగనంపటానికి సిద్ధంగా వున్నారు మా వాళ్లు. నా పెళ్లి అయిందనిపించటం మా వాళ్ల లక్ష్యం. ఆ ఇల్లు వదిలి అత్తవారిల్లనే మరో ఇంటికి నేను తరలి పోవడం వాళ్ల కోరిక. పేదవాళ్లకు నన్ను ఇచ్చి చేసినా మా వాళ్లు ఆర్థికంగా నాకు సహాయం చేయగలరు. ఆదుకోగలరు. వాళ్ల ధైర్యం కూడా అదే.

ఆ మాత్రం ఆర్థిక సదుపాయం నాకు పెళ్లి కాకపోయినా మా వాళ్ళు నాకు అందించగలరు. అయినా ఏ తల్లిదండ్రులైనా పోషించుకో లేక కాదుకదా కూతుళ్లకి పెళ్లిళ్లు చేసేది.

బహుశా ఇంతమంది నేను నచ్చలేదని చెప్పడమో, ఉత్తరాల ద్వారా తెలియ జేయడమో చేయడంవల్ల కాబోలు నాకు నచ్చని వ్యక్తికి నిర్భయంగా ఆ విషయం రాయగలిగాను. నచ్చలేదని చెప్పటానికి వెనుకాడ వలసిన అవసరం లేదని అనుభవం ద్వారాతెలుసుకున్నాను.

ఇంత పెద్ద ఉత్తరం రాసి మిమ్మల్ని ఇబ్బంది పెట్టినందుకు క్షమించండి. నా మనసులో మాట మీకు చెప్పేను. మీ అందచందాల్ని కించపరచటం గానీ, మీ ఆస్తిపాస్తుల్ని, హోదాను తక్కువగా భావించటంగానీ నా అభిమతం కాదు. మీరు నచ్చకపోవటానికి కారణం ప్రత్యేకించి చెప్పలేక పోయినా మీరు నాకు నచ్చలేదని మాత్రం చెప్తున్నాను. అయినా తుది నిర్ణయం మీకే వదిలేస్తూ, మీ జవాబు కోసం ఎదురుచూస్తుంటాను.

ఇట్లు
మీరు మెచ్చిన నేను"

ఇంత పెద్ద ఉత్తరాన్ని ఎంతో ఓపిగ్గా, శ్రద్ధగా కూడా చదివి సుధాకర్ చేతికి ఇచ్చాను.

మా ఇద్దరి మధ్యా ఓ పది నిముషాలు మౌనం.

"మరేమిటి నీ నిర్ణయం?" అడిగా న్నేనే.

"ఆమెనే చేసుకోవాలని నిర్ణయించుకున్నాను." అన్నాడు సుధాకర్.

విస్మయంగా చూశా నతని వంక.

"నువ్వు నాకు నచ్చలేదు అని నిర్మొహమాటంగా చెప్పేసిన ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయించుకున్నావా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును. ఆమెనే చేసుకుంటాను. అందుకు రెండు కారణా లున్నయ్. ఒకటి ఆమె నాకు చాలా నచ్చిన మాట నిజం. రెండోది ఆమెకు నేను నచ్చకపోవటం నిజం కాదు."

"నిజం కాదా?"

"కాదు. ఎంతోమంది మగవాళ్లు 'నువ్వు నాకు నచ్చలేదు'అని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆమెతో చెప్పటంతో ఆమెలో మగ వారంటే ఓ రకమైన కసి, కక్ష ఏర్పడినై. ఎవరైనా సరే ఆఅమ్మాయిని చేసుకోవటానికి ఇష్టపడితే 'నీవు నాకు నచ్చలేదు' అని చెప్పాలనే బలమైన కోరిక ఆమె నరనరాల్లోనూ జీర్ణించుకు పోయింది. ఆ అవకాశం కోసం ఎదురు చూస్తూంది. ఇప్పుడు నా ద్వారా ఆ అవ

కాశం వచ్చింది. తన కోరిక తీర్చుకుంది. తన కసి చల్లార్చుకుంది. అంతేకానీ తనకు నేను నచ్చక పోవటం మాత్రం నిజంకాదు."

అతని సైకియాట్రిస్టు బుర్రకి విస్తుపోయాను. ఓ డాక్టరుగా కన్నా ఓ వ్యక్తిగా ఎక్కువ అభినందించాను అతన్ని. అతని పట్ల నాకున్న అభిమానం ఎన్నో రెట్లు పెరిగింది.

కానీ ఓ అనుమానం.

డాక్టరుగా కూడా అతని అంచనా సరైంది కాకపోతే?

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక—ది. 23-3-88)

# అయ్యవారికి చాలిం

కిట్టిగాడికి పన్నెండేళ్లు. వాడి అసలు పేరు రాధాకృష్ణ. ఏడవ తరగతి చదువుతున్నాడు. పాపం వాడి కాలు అవిటిది. అందుకే చాలా మంది పిల్లలు వాడిని కుంటి కిట్టిగాడనీ, క్లుప్తంగా కుంటోడనీ కూడా అంటుంటారు.

అ, ఆలు కూడా సరిగ్గా వ్రాయటం చేతగాని కిట్టిగాడు ఆరు తరగతులు పాసయ్యాడు. పాసయ్యాడు అనేకంటే పాస్ చేశారు అంటే బాగుంటుంది.

ఏడవ తరగతిలో కామన్ పరీక్షలు కాబట్టి వాడిని ప్రయివేట్ కూడా చేర్పించాడు వాళ్ల నాన్న.

చదువు మినహా ఏ విషయంలో నైనా చురుగ్గావుండే కిట్టిగాడంటే ప్రయివేటు మాస్టారికి చాలా ఇష్టం.

రోజూ, పుస్తకాలు చేతపట్టుకొని అవిటి అడుగుల్తో ఊల వేసుకుంటూ వచ్చే కిట్టిగాడిని చూస్తే ముచ్చటగా వుండేదాయనకు.

గుండీ లూడి పోయిన చొక్కా, మొలత్రాడుతో బిగించిన నిక్కరు, తైల సంస్కారం లేని జుట్టు.

మోకాళ్లు, మోచేతులవరకు మట్టి గొట్టుకొని పోషణ సరిగా లేనట్లు కనిపిస్తాడు కిట్టిగాడు.

జారిపోయిన నిక్కరును పదేపదే పైకి లాక్కుని మొలత్రాడు బిగించుకోవటం అసంకల్పిత ప్రతీకార చర్యలా జరిగిపోతుంది.

చదువు కంటే ముందు వాడి వేషంలో మార్పు తీసుకురావా లన్న మాస్టారి ప్రయత్నాలకు ఫలితంగా తలకు నూనె రాయించు కోవటం మొదలు పెట్టాడు కిట్టిగాడు. రాసిన నూనె చెవులు దాటి చెంపల వరకూ కారుతుండేది. మళ్లీ నెలరోజుల తర్వాత నూనె దట్టించేవాడు తలకి. ఆ మాత్రం మార్పయినా వచ్చినందుకు తృప్తి పడ్డారు మాస్టారు.

వాడి నెలాగయినా చదువులో పైకి తీసుకురావాలనే పట్టుదల కలిగింది మాస్టారుకి.

"మావాడిని కొట్టండి, నరకండి. మీ ఇష్టం. వాడికి నాలు గచ్చరం ముక్కలు మాత్రం వచ్చేటట్టు సూడండి." కిట్టిగాడ్ని ప్రయి వేట్లో చేర్చేరోజు వాడితండ్రి చెప్పిన మాటలు మాస్టారి మనసులో ఓమూల పదిలంగా చోటుచూసుకున్నాయి.

మొదట్లో నయాన, భయానా చెప్పి చూశా రాయన. కానీ వాడిలో ఏ మాత్రం మార్పు కన్పించలేదు. వేసిన గొంగళి వేసిన చోటే వుండి పోయింది.

మాస్టారి దగ్గర ఏడవ తరగతికి ట్యూషను చదువుతున్న పది మంది పిల్లల్లోనూ కిష్టిగాడే అందరి కంటే మొద్దు.

ఓ రోజు వుదయం మాస్టారు, పిల్లలందర్నీ పదిహేనో ఎక్కం వరకూ అప్పచెప్పమన్నారు. కిట్టిగాడు మినహా అందరూ చెప్పే

శారు. ఒకటి రెండు ఎక్కాలు చెప్పి, మళ్ళీ పది పదకొండు ఎక్కాలు చెప్పి మౌనం వహించాడు.

అదేమని అడిగిన మాస్టారి ప్రశ్నకు బదులుగా మర్నాడు చెప్తానన్నాడు వాడు. అంతవరకే సంతోషపడి సరేనన్నారు మాస్టారు.

తరువాత వారం రోజులు ప్రయివేటుకు రాలేదు కిట్టిగాడు. జ్వర మొచ్చిన కారణంగా రాలేదని చెప్పి మరో నాలుగు రోజుల వ్యవధి సంపాయించాడు ఎక్కాలు ఒప్పచెప్పటానికి.

నాలుగు రోజులు పూర్తయ్యాక మళ్ళీ ఒకటి, రెండు, పది, పదకొండు ఎక్కాలే చెప్పి నేల చూపులు చూస్తూ నించున్నాడు కిట్టిగాడు. చిరునవ్వు వాడి పెదాలపై మెరిసి ఇట్టే మాయ మవటం మాస్టారు గమనించక పోలేదు.

అవిగో! ఆ చిలిపి చేష్టలే ఆయన్ని ఆకర్షించింది. అందుకే లోలోన ఆయన కూడా నవ్వుకొని పైకి మాత్రం కోపం నటిస్తూ నాలుగు దెబ్బలేశారు కిట్టిగాడ్ని.

మళ్ళీ వారం రోజులు ఎగనామం పెట్టాడు కిట్టిగాడు. అవారం రోజుల్లోనే ఓరోజు కిట్టిగాడి తండ్రి కనిపించాడు మాస్టారికి యాదృచ్ఛికంగా.

వాడు అరోజు ప్రయివేటు కని ఇంటి దగ్గర బయల్దేరుతున్నాడని, ఓరోజు పనుందిలే ఇంటిదగ్గర వుండమన్నా కాదని వచ్చేశాడని చెప్పాడు కిట్టిగాడి నాన్న మాస్టారితో. మాస్టారు కోపంతోవూగి

పోయాడు. మర్నాడు వచ్చిన కిట్టిగాడ్ని చావగొట్టారు. సాయంత్రానికల్లా పదిహేను ఎక్కాలు చెప్పకపోతే చంపుతానన్నారు.

కిట్టిగాడి కళ్ళ వెంట ఒక్క బొట్టుకూడా నీరు రానందుకు మాస్టారికి ఆశ్చర్యం వేసింది. అంతగా కొట్టినందుకు పాపం ఆయన చాలా మధన పడ్డాడు. కాని వాడి మంచికోసమే కదా కొట్టిందని తనకు తానే సమాధాన పరుచుకున్నారాయన.

ఏం చేస్తే ఏం లాభం? సాయంత్రం వాడు ఒక్క ఎక్కం కూడా చెప్పలేదు. ఇదివరకు చెప్పిన ఆ నాలుగు ఎక్కాలూ కూడా చెప్పకుండా శిలాప్రతిమలా నించున్నాడు.

ఉదయాన్నే కొట్టివుండటాన మళ్ళీ సాయంత్రం కూడా కొట్టటానికి మాస్టారికి మనసొప్పలేదు. ఎన్నో రకాలుగా ప్రయత్నం చేసి వాడిచేత పెదవి విప్పించలేక పోయారు మాస్టారు.

మిగతా పిల్లలతో పాటు ఇంటికి బయలుదేరాడు కిట్టిగాడు.

ఇలా సాగిపోతున్న కిట్టిగాడి చదువులో ప్రయివేటులో చేరిన రోజుకీ, యిప్పటికీ ఏమాత్రం అభివృద్ధి కన్పించలేదు.

వాడిలో మార్పు యెలా తీసుకురావాలా అన్న ఆలోచనతోనే మాస్టారు యెక్కువ కాలం గడుపుతున్నారు. వాడిపై ఆయన కున్న ప్రత్యేకమైన వాత్సల్యమే అందుక్కారణం. అందుకే అంత శ్రద్ధ తీసుకుంటున్నారాయన కిట్టిగాడి విషయంలో.

చదువు విషయంలో మొండిగా తయారయిన కిట్టిగాడు ఎన్ని చావుదెబ్బలయినా ఓర్చుకుంటాడు గానీ చదవడు. వ్రాయడు. ప్రశ్న అడిగితే రాయిలా చలనం లేకుండా నిలబడతాడు.

కొట్టికొట్టి విసిగిపోయిన మాష్టారికి వాడినెల మార్పాలోఅంతు బట్టలేదు. పైగా ఇప్పుడిప్పుడే వాడిలో నిర్లక్ష్యం పెరిగి పోతున్నట్లు గ్రహించా రాయన.

ఓ వారం, పది రోజులపాటు వాడి విషయం ఏమీ పట్టించు కోకుండా ఉదాసీనంగా వుండిపోయారాయన.

మిగతా క్లాసు పిల్లలకి పరీక్షలు కావటంవల్ల కూడా ఆయన వీడిగురించి శ్రద్ధ తీసుకోలేక పోయారు. ఓ వుదయం తండ్రినివెంట పెట్టుకుని వచ్చాడు కిట్టిగాడు.

ఏం పంతులుగోరు మా వాడికేం సెప్పట్లేదంటగా. వూర్కే కూచోబెట్టి పంపుతున్నారని సెపుతున్నాడేం? అడిగాడు కిట్టిగాడి తండ్రి.

ఏమీ పట్టనట్టు మౌనంగా నేలచూపులు చూస్తూ కూర్చు న్నాడు కిట్టిగాడు.

మాష్టారికి పట్టరాని కోపం వచ్చింది. చెప్పినవన్నీ వచ్చా యోమో కనుక్కున్నారా" అడిగాడు మాష్టారు.

"అయన్నీ అడిగి తెలుసుకునే ఓపికా తీరికా మాకుంటే మీ దగ్గర కెందుకు పంపుతా పంతులుగారూ? అయినా అవన్నీ వచ్చిన య్యో, రాలేదో నాకేం తెలుస్తుంది. మీరు సూసుకుంటారనే గదా ఆ రోజున మీకప్పజెప్పి వెళ్ళింది?" మాష్టారేదో తప్పు చేసినట్టుగా అన్నాడు కిట్టిగాడి తండ్రి.

"మీవాడికి ఎంత చదువొచ్చో చూద్దురుగాని. కాసే పలా కూర్చోండి" అని ఓ బెంచి చూపించారు మాష్టారు.

కిట్టిగాడిని ప్రశ్నలడిగేముందు మరో అయిదారుగురు పిల్లల్ని ఏవేవో ప్రశ్నలడిగారు మాష్టారు.

అన్నిటికీ అందరూ సమాధానాలు చెప్పారు.

"పదమూడో ఎక్కం చెప్పరా?" అడిగాడు కిట్టిగాడ్ని.

గబగబా చెప్పాడు తప్పుల్లేకుండా!

"పధ్నాలుగు చెప్పు"

చెప్పాడు కిట్టిగాడు,

ఇంగ్లీషు స్టోరీ ఒకటి చెప్పమన్నాడు.

గడగడ చెప్పేడు వాడు.

మరోటి, మరోటి.

అన్నింటికి సమాధానాలు సరిగ్గానే చెప్పాడు కిట్టిగాడు. ఓ పక్క ఆశ్చర్యం, మరోపక్క ఆనందంలో మునిగిపోయారుమాష్టారు

"మీరడిగిన వాటన్నిటికీ వాడు బదులు చెప్తూనే వున్నాడు. మీరెక్కడా తప్పన్నట్టుగా లేదు మరి...." బల్లమీద నుంచి లేస్తూ అన్నాడు కిట్టిగాడి తండ్రి.

"మీవాడి నోట్లోనుంచి సమాధానం వినటం యిదే మొదటి సారి నాకు...."

"ఏదయినా కాస్త శ్రద్ధగా చెప్పండి పంతులుగారూ. డబ్బులు తీసుకునేతప్పుడు కొంచెం చదువు కూఢా చెప్తే బావుంటుంది. వూరి కనే కూకోవాల. డబ్బులు కావాల. అబ్బే, ఏం పంతుళ్ళో ఏం చదువులో?" చివరి మాటలు అంటూనే బయటకు నడిచాడు కిట్టిగాడి తండ్రి.

బజార్లో ఏదో పనుండి వెళ్ళొచ్చారు. ప్రయివేటు పిల్లలు ఒక రిద్దరు వస్తున్నారు అప్పుడే.

దొడ్డివైపు ఖాళీ స్థలం వైపు ఏవో మాటలు వినిపించి కిటికీలో గుండా చూశారు మాష్టారు.

కిట్టిగాడు, మరో పదో తరగతి చదువుతున్న కుర్రవాడు కూర్చొని వున్నారు.

"అరె కిట్టిగా! మాష్టారెప్పుడు ఏవి అడిగినా చెప్పవుగదా మరి ప్రొద్దున అన్నీ సరిగ్గా ఎట్లా చెప్పావురా?" అడిగాడు పదో తరగతి వాడు.

"ఈమధ్య చదివాన్లే" అంత కోపంలోనూ కిట్టిగాడి మాట లకు నవ్వొచ్చింది మాష్టారికి.

"మరి మా నాన్నకి మాష్టారేం చెప్పటం లేదని యెందుకు చెప్పావ్?"

"ఎవ్వరికీ చెప్పనంటే చెప్తా" అంటూ చెయ్యి ముందుకు చాచేడు కిట్టిగాడు.

"చెప్పన్లే చెప్పు" చేతిలో చెయ్యివేశాడు రెండోవాడు.

"ఆయన నన్నెట్టాకొడతాడో నీకు తెల్సుకదరా. ప్రద్దానికీ చావగొడ్తుంటాడు కదా. అందుకే ఆయనంటే నాకు బలే కచ్చ. ఎట్లా యినా సరే మా అయ్యను తీసుకొచ్చి పోట్లాడా లనిపించింది."

"అందుకోసమే మా అయ్యకి అట్టా చెప్పాను. అసలు నేను ఈ పదిరోజులు బాగా చదివింది కూడా ఇందుకే."

శూన్యంలోకి చూస్తూ నిలబడిపోయారు మాష్టారు.

"అవున్రా మరి నువ్వు చదవచ్చు కదా?" అమాయకంగా అడిగాడు రెండోవాడు.

"ఏందోయ్ చదివేది–ఏడవ తరగతిక్కూడా. పోయినేడు మా అన్న ఏడో క్లాసే గదా. అసలు మనకి పరీక్షల్లో మన పంతుళ్ళే చెప్తారంట ఆన్సర్లన్నీ. బోర్డు మీద కూడా వ్రాస్తున్నారట కొన్ని బళ్ళలో అయితే తెల్సా".

"అందుకే ప్రయివేటు వద్దు ఏమీవద్దని చెప్పాను మాఅయ్యకి కానీ నా మాట వినిపించుకోకుండా పంపాడాయన."

కిట్టిగాడి మాటలన్నీ విన్న మాస్టారికి వాడిమీద కోపంఅంతా కరిగిపోయింది. వాడు చదవక పోవటం వాడి తప్పు కాదని తెలిసిం దాయనకి. అందుకు బాధ్యులెవరో కూరా తెలిసింది.

మయూరి సచిత్ర వార పత్రిక—30-8-85

"రిక్షా దొరక్క ఏమవుతుందిలే. కాకపోతే మరో పదినిమిషాలు ఎండలో నిలబడాలి. అంతేగా....ఆ .. అదిగో రిక్షా వస్తున్నదిచూడు"

"ఏయ్ రిక్షా" పిల్చాడు ప్రకాశం.

"బాడుక్కి వస్తావా"

"ఏడ కెళ్ళాలండీ?"

చెప్పేడు ప్రకాశం.

"ఎక్కండి" రిక్షావాలా.

"ఎంత ఇవ్వమంటావ్ ఇద్దరికీ"

"ఎంతో ఇద్దురులే ఎక్కండి బాబు"

'అలా కాదులే చెప్పవయ్యా'

'మీ ఇష్టం వచ్చినంత ఇయ్యండి బాబు. నేను ఎవర్నీ బేరం అడగను. ఎవరు ఎంతిస్తే అంత తీసుకుంటా నంతే .... ఎక్కండి యల్దాం'

ఇద్దరూ రిక్షా ఎక్కి కూర్చున్నారు.

తలకు గుడ్డ చుట్టుకుని , రిక్షా తొక్కడం ప్రారంభించాడు రిక్షావాలా.

'ఊ....ఏమిటన్నావ్ నీ పూజలూ'

'అబ్బబ్బ మనిద్దరిమధ్య ఎప్పుడూ జరిగే వాదనేకదా.ఎండకు ఓ పక్కన చస్తుంటే ఏమిటీ నీ సోది' చనువుగా విసుక్కున్నాడు రామ్మూర్తి.

"బాబు ఆ యన్జోలా యెవరు .. ఉద్యోగం చేసుకుంటున్నా రంతా సమ్మె చేత్తన్నారంటగా. ఇంకా యెన్నాళ్ళు చేత్తారు సామీ" రిక్షా తొక్కుతూ అడిగాడు రిక్షావాలా.

'ఆ....ఏమో ఎవరికి తెల్సు. ఎన్నికలొస్తున్నాయ్ కదా నాయకులే దిగివస్తాయని వీరు, నాలుగు నెలల్నుంచి జీతాల్లేవు కడుపులు కాల్చుకుంటూ, అప్పులు వడ్డీలు పెంచుకుంటూ ఎన్నాళ్లుంటారు ఉద్యోగస్తులే దిగివస్తాగని వారు ఎవరికి వాళ్లు భీష్మించుకూర్చున్నారు. ఎన్నాళ్లు చేస్తారో. అయినా వాళ్ళ సమ్మెతో నీకేం పని' అడిగాడు రామ్మూర్తి.

'ఆ....ఏం లేదు బాబు. అల్ల సమ్మె అయిపోతే ఈ రిక్షా బండి తొక్కేబాధ తప్పుద్దని' రిక్షా మెరకమీదికి లాగుతూ చెప్పేడు తను.

అతని సమాధానం అర్థంకాక ఒకరి ముఖం ఒకరు చూసుకుని పెదవులు విరిచారు రామ్మూర్తి, ప్రకాశం.

'వాళ్ళ సమ్మెకు నీవు రిక్షా తొక్కటానికి సంబంధం ఏమిటయ్యా?' అనడిగాడు ప్రకాశం.

'అసలే జీతాల్లేక అవస్థ పడుతున్న కొడుక్కి ఇంట్లో తను మరింత భారం కాకూడదనే పరిస్థితి వున్న దౌర్భాగ్యపు తండ్రేమో' మనసులోనే అనుకున్నాడు ప్రకాశం.

'రిక్షా బాడుగకు వేయడం నా పని కాదు. మాది ఈ వూరుకి పక్కనే వున్న చిన్న పల్లె. రోజూ ఉదయం, సాయంత్రం పాలు తీసుకువచ్చి వాడిగ్గా కొన్ని ఇళ్ళవాళ్లకి అమ్ముకుంటాను. నా ఖాతా వాళ్ళంతా ఉద్యోగస్తులే. గత మూడు నాలుగు నెలలబట్టి అళ్ళకి జీతాల్లేవుగందా .... ఇంకా నా కీయాల్సిన డబ్బు ఎట్నుంచి తెచ్చిస్తార్లెమ్మని అల్లనడక్కుండా రిక్షాబండి లాగి నాలుగు డబ్బులు సంపాయిత్తన్నా. మరి నా సంసారం సాగాలి గందా.'

అప్రతిభు లయ్యారు అతని మాటలకు రిక్షాలో కూర్చున్న స్నేహితు లిద్దరూ.

"పిచ్చివాడిలా వున్నావే. ఏ హోటల్ వారికి అమ్ముకున్నా నీకు ఏరోజు డబ్బులు ఆరోజు వస్తయ్ కదయ్యా! ఇలా రిక్షా వేసుకుని కష్టపడకపోతే" అన్నాడు రామ్మూర్తి.

"నిజమే బాబు. తమరుసెప్పింది రైటే. ఆళ్ళకాడ డబ్బుల్లేవని ఏ హోటల్ వాళ్ళకో అమ్ముకుంటే నాకు డబ్బు లొత్తయ్. కానీ పాపం నిదర లేచిన కాణ్నించి చంటి పిల్లలకు పాలు, పెద్దారికి కాఫీ అన్నంలోకి మజ్జిగ ఇయన్నీ ఆళ్ళకి ఎట్లా వత్తయ్ బాబు. ఈ పది రోజులు ఇట్లా కష్టపడితే నాకు వచ్చే నష్టం లేదుగా బాబు. జీతాలు రాకపోతే ఆళ్ళుమాత్రం ఏణ్నించి తెస్తారు పాపం. అందుకే వాళ్ళని ఇబ్బంది పెట్టటం ఇష్టంలేకే నేనూ ఇబ్బంది పడకుండా సరిపోద్దని ఇదిగో ఈ మధ్యనే రిక్షాబండి యాత్తన్నా."

"కష్టానికీ అలవాటు పడ్డవాళ్ళం, మేం ఏ పనైనా చేయగలం గానీ పాపం సదూకున్నోళ్లు ఉద్యోగాలు చేత్తా హోదాలో వుండోరు వాళ్లు ఏం చేయగలరు చెప్పండి. ఏదో మడిసికి మడిసి సాయం సేయకపోతే ఎట్టాగులేఅని సేత్తండ. దేవుడు సేయం సేయకపోడు" రిక్షా ఆపి ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ నిలబడ్డాడు రిక్షావాలా.

అతని చేతిలో అయిదు కాగితం వుంచి ఇంటిముఖం పట్టారు మిత్రు లిద్దరూ.

"దేవుణ్ని చూశావా రామ్మూర్తీ" అడిగాడు ప్రకాశం.

అర్థం కానట్లు ప్రకాశంవంక చూశాడు రామ్మూర్తి.

దేవుడు గుళ్లోనే వుండడు రామ్మూర్తీ. ఈ రిక్షావాలా దేవుడే. సాటి మనిషి ఇబ్బందుల్లో వున్నప్పుడు అతను చేస్తున్న త్యాగం, సాయం ఎంత విలువైనదో గమనించావా? ఈ జనారణ్యంలో ఆ పాటి త్యాగగుణం కలిగి వుండటం కంటె కావలిసింది ఏముంటుం దంటావ్. మానవత్వమే దైవత్వం. కాదంటావా?" అనడిగాడు ప్రకాశం.

తనఅంగీకారం తెలుపుతున్నట్లుగా తలాడించాడు రామ్మూర్తి

(ఆంధ్రభూమి దిన పత్రిక)